తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కలియుగ కల్పవల్లీ...శాఖాంబరీ నమోస్తుతే...!!

బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 5 ప్రభాతవార్త



శివుని పట్టపు రాణిగుణమని శాఖాంబరీదేవికా నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా 2వ రోజైన శనివారం అమ్మవారు శాఖాంబరీదేవిగా అవతారమెత్తారు. విశేషాభిషేకం, వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరణ గావించారు. కలికిరికి చెందిన శ్రీలక్ష్మీ, శ్రీనివాసులు కూరగాయలు విరాళంగా అందించారు. చౌడేపల్లి మాజీ ఎంపిపి రెడ్డిప్రకాష్, పద్మావతి, తిరుపతి వేణుగోపాల్‌రెడ్డి సుగుణ, జ్యోతమ్మ, బెంగళూరు మంజునాథ్, పుంగనూరు ఎఆర్‌ఫంక్షన్‌హాల్ మునిరాజ, ఆశారాణి, లబూరామ్, గీతాదేవిలు ఉభయదారులుగా వ్యవహరించారు.

## హంస వాహనంపై మలయప్ప



తిరుమల, అక్టోబర్5 ప్రభాతవార్తప్రతినిధి:
బ్రహ్మదేవుని వాహనమైన హంసను స్వయంగా తనకు వాహనసేవలో మలచుకుని సరస్వతీ అలంకారంలో మలయప్పస్వామి భక్తులకు అభయమిచ్చాడు. కొండప జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి ఏడుకొండలస్వామి ఉత్సవమూర్తి మలయప్పను వీణాపాణిగా సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. హంస స్వరూపుడైన ఏడుకొండలవాడు రాత్రి తిరువీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు, అశ్వా లు ఠీవిగా నడుస్తుండగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించా రు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ శ్యామలరావు దంప తులు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

# పవిత్రత,నమ్మకం కాపాడేలా పనిచేయాలి

**-భక్తుల అభిప్రాయాలకనుగుణంగా మార్పులు కనబడాలి -టిటిడి అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం**



తిరుమల, అక్టోబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:
పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ పవిత్రతను కాపాడేలా, భక్తులు ఉంచిన నమ్మకం మరింత పటిష్టంగా కాపాడేలా అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశించారు. ఏ విషయంలో కూడా రాజీపడొద్దని సూచించారు. తిరుమలలోని అటవీప్రాంతాన్ని మరింతగా పచ్చదనం పెంచాలన్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులు సంతృప్తిగా తిరిగి వెళ్ళాలని సిఎం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఉదయం పద్మావతివిశ్రాంతి భవనంలో తిరుమల ఆలయ పవిత్రత, తిరుమలలో భక్తుల సౌకర్యాలు, అన్నప్రసాదాలు, లడ్డూనాణ్యత, భక్తుల అభిప్రాయాల మేరకు టిటిడి అధికారుల పనితీరు, విఐపిల హడావుడి తదితర అంశాలపై గంటసమయం సమీక్షచేశారు. రాష్ట్రదేవాదాయ శాఖామంత్రి ఆనంరామనారాయణరెడ్డి, టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితర అధికారులతో సిఎం చంద్రబాబునాయుడు సమావేశం నిర్వహించారు. తిరుమలకు విఐపిలు వస్తే ఇకపై హడావుడి కనినించకూడదని, విఐపిల సంస్కృతి తగ్గించాలని సిఎం సంచలన నిర్ణయం వెల్లడించారు. సూపర్‌స్పెషాలిటీ సేవలందిస్తున్న స్విమ్స్ ఆస్పత్రి పనితీరు, వైద్యసేవలు మెరుగుపరచాలన్నారు.





### చిన్నశేషవాహంపై
## మురళీకృష్ణుడు

తిరుమల, అక్టోబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి చేతిలో పిల్లనగ్రోవి ధరించి మురళీకృష్ణుడుగా భక్తులకు అభయమిచ్చాడు. తిరుమలలో మొదలైన సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో రెండవరోజు శనివారం ఉదయం ఐదుతలల బంగారు చిన్నశేషవాహనంపై మలయప్ప చిద్విలాసంగా కనువిందుచేశాడు. భక్తులు గోవింద నామాలతో స్వామివారికి కర్పూర హారతులు పట్టారు. పలు ఆధ్యాత్మిక పుస్తకాలను

### ఇండిగో ఢిల్లీ సర్వీసును
## ప్రారంభించిన కేంద్ర మంత్రి

రేణిగుంట(తిరుపతి), అక్టోబరు 5 ప్రభాతవార్త:



జ్యోతి ప్రజ్వలన చేసి విమాన సర్వీసును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి

అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి న్యూ ఢిల్లీకి ఇండిగో విమాన సర్వీసును కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు శనివారం ప్రారంభించారు. అంతకు ముందు విమాన సర్వీసును ప్రారంభిం చడానికి రేణిగుంట చేరుకున్న కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ టీడీపీ ఎంపీ, అమరరాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలసి ముందుగా విమానాశ్రయంలో ఇండిగో కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం జెండా ఊపి విమాన సర్వీసును ప్రారంభించారు. ఈ విమానం ప్రతిరోజు ఢిల్లీ, రేణిగుంట మధ్య రాకపోకలు సాగిస్తుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత విమానాశ్రయ అథారిటీ చైర్మన్ సురేష్, జిల్లా జాయింట్ కలెక్టర్ బన్సల్ విమానాశ్రయ అధికారులు, ఇండిగో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమలకు అనుకూలం:విమానాశ్రయ హబ్‌గా రేణిగుంట

**డబుల్ ఇంజన్ సర్కారు అభివృద్ధికి పరుగులు -చిన్ననాటి స్నేహం:ఊరందూరులో ఆతిథ్యం**
**అమృత పథం నిధులు అందించి శ్రీకాళహస్తి అభివృద్ధికి సహకరించండి -కేంద్రమంత్రి రామమోహన్‌కు ఎంఎల్ఏ అభ్యర్థన**

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త
కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరపు రామమోహన్‌నాయుడు తన చిన్ననాటి స్నేహితుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించారు. శనివారం మంత్రి రామమోహన్ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట విమానాశ్రయంలో న్యూఢిల్లి విమానం ప్రారంభానికి వచ్చారు. ఈ సంద ర్భంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, మంత్రికి చిన్ననాటి స్నేహ మని అందుకే వచ్చానని మంత్రి వివరించారు. ఆయన మధ్యాహ్నం భోజనం పూర్తి చేసిన తరువాత మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఎన్నో అంచనాలతో డబుల్ ఇంజన్ సర్కారుకు అవకాశం ఇచ్చారు. వారి ఊహాలు అంచనాలకు తగ్గ ట్లు పని చేయటం తమ కర్తవ్యంగా భావించి పని చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రజలు రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలు, అంకాక్షలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. గతంలో తాను ఉత్తరాం ధ్ర అభివృద్ధిని మాత్రమే కాంక్షించే వాడని కానీ నేడు తాను కేంద్ర మంత్రిగా ఉండటంతో



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామమోహన్‌నాయుడు

రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నిధుల సాధనకు కృషి చేస్తున్నాను న్నారు. రాజధాని అభివృద్ధికి అమరావతికి రూ.15వేల కోట్లు, పోల వరం అభివృద్ధి12వేల కోట్లునిధులు సాధనకుకృషి చేస్తున్నామన్నారు.

**రేణిగుంట విమానాశ్రయాన్ని హబ్‌గా తీర్చి దిద్దుతాము:**
శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో మంచి అవకాశాలున్న ప్రాంతమని మంత్రి రామమోహన్ అన్నారు. ఇక్కడ పరిశ్రమలకు అనుకూలం, రియల్ ఏస్టేట్ వ్యాపారానికి అనుకూలంగా ఉందన్నారు. దీనికి కారణం ఈ నియోజకవర్గంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం అభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు అవకాశం అన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు విజయవాడ, విశాఖ పట్టణం తిరుపతి విమానాశ్రయాలను హబ్‌లుగా అభివృద్ధికి ఆదేశించారన్నారు. ఈ మేరకు రేణిగుంట విమానాశ్రయాన్ని అందంగా తీర్చి దిద్దటమేకాకుండా ఇక్కడ నుంచి గల్ఫ్ దేశాలతో పాటు భారత దేశంలోని నలుమూలలకు విమానాలను నడుపుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామన్నారు. కాగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి అభివృద్ధికి అమృతపథకంలో ప్రత్యేక నిధులు కోరారని పరిశీలించి మంజూరు చేస్తామన్నారు.

**ఘనస్వాగతం:**
శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామానికి మంత్రి కింజరపు రామమోహన్‌రావు రాగా ఆయనకు తెలుగుదేశం క్యాడర్ ఘనస్వాగతం చెప్పారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### మూడవ శనివారం కళ్యాణ వెంకన్నకు
## మహిళల దీపారాధనలు



చంద్రగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:
తిరుమల శ్రీవారికి పవిత్రమైన మాసం పెరటాసి నెల (తిరుమల నెలగా ప్రశస్తి) మూడవ శనివారం రోజున శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి మహిళలు పెద్దఎత్తున ధీపారాధనలు గావించి మ్రొక్కులు తీర్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో తిరుమల శనివారాలుగా ప్రశస్తి పొందిన ఈ మాసంలో మూడవ శనివారం దాదాపుగా ప్రతి కుటుంబం ఇల్లు వాకిళ్ళు శుభ్రం చేసుకుని, ఇంటికి సున్నంతో ఎళ్ళలు వేసి అత్యంత పవిత్రమైన మనస్సుతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి మూడు నామాలను నుధుటన ధరించి స్వామి వారికి పిండి వంటలతో నైవేద్యం సమర్పించి గోవింద నామస్మరణలతో మ్రొక్కులు తీర్చుకోవడం శతాబ్దాల తరబడి సంప్రదాయంగా వస్తున్నది. అదేవిధంగా మూడవ శనివారం రోజున గ్రామంలోని బంధు మిత్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి రుచికరమైన భోజనాన్ని వడ్డించడం ద్వారా పండుగను జరుపకుంటారు. ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

# కలెక్టర్, ఎమ్మెల్యేచే తహసిల్దార్ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:
చిత్తూరు రూరల్ తహసిల్దారు కార్యాలయంను శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ప్రారంభించారు. ఇది వరకు వున్న పాత అర్డీఓ కార్యాలయ భవనంను చిత్తూరు రూరల్ తహసిల్దారు కార్యాలయం ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్‌ను విన్నవిస్తే ఆ మేరకు చిత్తూరు పాత అర్డీఓ కార్యాలయంకు మరమ్మత్తులు చేసి శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ చిత్తూరు రూరల్ మండలానికి తహసిల్దారు కార్యాలయంను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కార్యాలయంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సోమవారం నుండి ప్రజలకు చిత్తూరు రూరల్ తహసిల్దారు కార్యాలయం పూర్తి స్థాయిలో అందుబాటులో వుండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రజలకు అందుబాటులో వుండేలా



చిత్తూరు రూరల్ తహసిల్దారు కార్యాలయంను కేటాయించాలని కలెక్టర్‌ను కోరితే వెంటనే అనుమతించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, అర్డీఓ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, చిత్తూరు రూరల్ తహసిల్దారు లోకేశ్వరీ, సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పం రెస్కో జెఎఒ కృష్ణమూర్తి అరెస్ట్..
### 14 రోజుల రిమాండ్

కుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)లో జెఎఒగా పనిచేస్తున్న కృష్ణమూర్తిని శనివారం కుప్పం పోలీసులు అరెస్ట్ చేశారు. రెస్కోలో మేనేజింగ్ డైరెక్టర్ వాహనంతో పాటు 23.86లక్షల నిధుల దుర్వినియోగంకు సంబంధించి నమోదైన కేసులో కృష్ణమూర్తి ఎ3గా ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి పద్నాలుగు రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

# కన్నులపండువగా టిటిడిచే శ్రీవారి కళ్యాణోత్సవం

**- తిలకించేందుకు హాజరైన వేలాది భక్తులు.. మార్మోగిన గోవిందనామస్మరణ!!**

కుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త
కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని శనివారం మండలంలోని బేటరాయస్వామి ఆలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవంను తిలకించేందుకు భక్తులువేల సంఖ్యలో హాజరయ్యారు. కళ్యాణోత్సవంసందర్భంగా టిటిడి అర్చకులు తిరుమల నుంచి తీసుకువచ్చిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి కన్నులు మిరమిట్లు గొలిపేలా అలంకరించారు. ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ దంపతులు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. స్వర్ణాభరణ శోభితులై శ్రీనివాసస్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తజన కోటి గోవిందా అంటూ నామస్మరణ చేస్తూ కళ్యాణోత్సవంను అత్యంత భక్తి శ్రద్ధలతో తిలకించి తన్మయత్వం పొందారు. ముహూర్త ఘడియల సందర్భంగా టిటిడి అర్చకులు స్వామి, అమ్మవార్లకు వివాహ వేడుకలు ఘనంగా జరిపారు. కళ్యాణోత్సవంకు హాజరైన దంపతులు సంప్రదాయ రీతిలో వస్త్రాలు ధరించి హాజరయ్యారు. కాగా కళ్యాణోత్సవం







సందర్భంగా బేటరాయస్వామి కొండ ప్రాంతం ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంను తిలకించేందుకు నియోజకవర్గంనుంచే కాక కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు వాహనాలకు పార్కింగ్ వసతి, మంచినీటి వసతికల్పించారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదానం జరిపించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ దంపతులు, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ దంపతులు, సలహాదారు నరేష్‌చారి, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు దంపతులు, శ్వేత దీప గ్యాస్ ఏజెన్సీస్ అధినేత విఎ చంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి సాంబశివం, రాష్ట్ర నేతలు శాంతారాం, డా॥ వెంకటేష్, పైపాళ్యం మాజీ సర్పంచ్ వల్లెప్ప ఉమామహేశ్వరి దంపతులు, మాజీ సర్పంచులు సికె మణి, శ్రీనివాసులు, ఎంపిడిఓ సాయిలహరి, ఎఫ్ఆర్వో జయశంకర్, అర్బన్ సిఐ జిటి నాయుడు, స్థానిక అధికార పార్టీ నేతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బతుకు తెరువే.. బతుకును కడ తేర్చింది..

వాకాడు, అక్టోబర్ 5, ప్రభాతవార్త



వెంకటయ్య మరణంతో గుమికూడిన సహచర కూలీలు

బ్రతుకు తెరువు కోసం సంసారం సాగేందుకు ఉపాధి హామీ పనికి వెళ్లి సహచర కూలీలు మధ్యనే ప్రాణం కోల్పోయిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం వాకా డు మండలం మూల పడవ పంచాయితీ పరిధి లోని పాముల తేరి గ్రామ సమీ పంలో రోజులాగే శనివారం మెట్ట చెరువు కాలువలో కూలీలు మధ్య పాములతేరి గ్రామానికి చెందిన తీపలపూడి వెంకటయ్య (52) పనిచేస్తుండగా చాతి నొప్పంటూ కింద కూర్చొన్నాడు. సహచర కూలీలు వెంకటయ్య పరిస్థితి గమనించిన వెంటనే పలువురు కూలీలు ఎత్తుకొని ఇంటికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలోనే కన్నుమూశాడు. పరిస్థితిని గమనించిన కూలీలు లోబోదిబోమంటూ ఇంటికి తీసుకెళ్లారు. మృతి చెందిన వెంకటయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. పాములు తేరి గ్రామంలో విషాదం నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఏవివో విజయ్ వెంటనే పాములతేరి గ్రామంలోని ఉపాధి కూలి వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సహచర కూలీలతో మాట్లాడి సమాచారం ఉన్నతాధికారి దృష్టికి అందిస్తానన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 55మంది ఎంపిక



**రామకుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త** మండలంలోని విజలాపురం పిహెచ్‌సిలో నిర్వహించిన ఉచిత క ంటి వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. 55మం దిని ఉచిత కంటి ఆపరేషన్లకు వైద్యులు ఎంపిక చేశారు. వీరికి శంకర్ నేత్రాలయలో ఆపరేషన్లు నిర్వ హిస్తారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమంలో ఎంపిక చేసిన వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా॥ పూజిత, దేశం నేతలు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, భువన్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

రామకుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త

మండలంలోని లింగాపురంకు చెందిన తెదేపా కార్యకర్త సదాశివయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శని వారం మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, దేశం నేతలు సదాశివయ్యకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ తరపున బాధిత కుటుంబానికి పదివేల రూపాయల సాయం అందించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, పెరుమాళ్, సుబ్రమణ్యం, చంద్రబాబురెడ్డి, మోహన్, రామచంద్రారెడ్డి, గిరి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శాంతిపురం, అక్టోబర్ 5 ప్రభాతవార్త

శాంతిపురంలోని 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిఇఇ హిమ్మత్ సాగర్ తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 2గంటల దాకా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు కోరారు.

## వి.కోట సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

**వి.కోట, అక్టోబర్ 5 ప్రభాతవార్త** వి.కోట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పిఎన్ లక్ష్మమ్మ చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెలలో వి.కోటలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో సర్పంచ్ కుటుంబీకులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించారని ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేసి ఉప సర్పంచ్‌కు కేటాయించారు. అయితే పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగేందుకు సహకరించాలని ఇందుకు చెక్‌పవర్‌ను పునరుద్దరించాలని జిల్లా కలెక్టర్‌ను సర్పంచ్ పిఎన్ లక్ష్మమ్మ అభ్యర్థించడంతో కలెక్టర్ చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పంచాయతీని అభివృద్ధి చేస్తామని అందరూ సహకరించాలని ఆమె కోరారు.

## నీటి ట్యాంకర్ బోల్తా.. యువకుడికి గాయాలు

కుప్పంరూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త

మండలంలోని బేటరాయస్వామి కొ ండ సమీపంలో నీటి ట్యాంకరు బోల్తా పడి ఓ యువకుడు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని 108లో కుప్పం ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. శనివారం బేటరాయస్వామి కొండ వద్ద శ్రీవారి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ నేపథ్యంలో భక్తులకు తాగునీటిని సరఫరా చేసే ందుకు నీటి ట్యాంకరుతో డ్రైవర్ భాస్కర్ వచ్చాడు. అయితే అదుపు తప్పి ట్యాంకర్ బోల్తా పడడంతో భాస్కర్ కాలికి తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు.

## అర్ధగిరి ఆలయానికి రెండు వాటర్ కూలర్‌లు విరాళం



**తవణంపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థా నంకు అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారు శనివారం రెండు వాటర్ కూలర్ (డిస్పెన్సర్)లను విరాళంగా అందజేశారు. భకుల సౌకర్యార్థం వారు వా టిని విరాళంగా అందజేశారు. డిస్పెన్సర్‌లను సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ బి.నవీన్‌కు మార్‌రెడ్డి తమ సిబ్బందితో కలసి ఆలయ ఈఓ టి.హనుమంతరావుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ, సప్తగిగి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## కాణిపాకం సన్నిధిలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

**కాణిపాకం,అక్టోబర్ 5 ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్‌కుమార్ అగర్వాల్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆనందమయం పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

### -15యేళ్ళ తర్వాత కలసిన వైనం



**చౌడేపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త** మరపురానివి బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు...అరేయ్ ఒరేయ్ నుంచి ఒస్థాయికి వచ్చిన వారందరూ ఒకటయ్యా రు...చదువుకొమ్మ నీడన కూర్చన్న స్నేహితులు ఉన్నత విద్యకోసం విడిపోయి 15యేళ్ళ తర్వాత అదే చెట్టుకిందకు చేరుకొని ముచ్చటించుకొన్న తీరు మనసును కట్టిపడేసింది. కన్నుల పండుగలా జరిగిన ఈ దృశ్యానికి స్థానిక ఉన్నతపాఠశాల వేదికగా మారింది. ఇదే పాఠశాలలో 2006-07సంవత్సరంలో 10వ తరగతి చదువుకొన్న పూర్వపు విద్యార్థులు శనివారం ఒకరినొకరు కలుసుకొని ఆనందంలో మునిగి పోయారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారందరూ పాఠశాలకు చేరుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. తమ ఉన్నతికి కారకులైన గురువులను దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలందించారు. చిన్నప్పుడు చేసిన అల్లర్లను గుర్తుకు తెచ్చుకొని అన్నీ మరచి పగలంతా సంతోషంగా గడిపారు. అందరూ కసలి సహపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల 2006-07పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మీయుల ఓదార్పులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి



**చౌడేపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలు తమ ఆత్మీయ కుటుంబాల్లో వ్యక్తులను కోల్పోయిన వారి ఇళ్ళకు వెళ్ళి సంతాపాన్ని తెలిపారు. కాగతి ఎంపిటీసీ నారాయణరెడ్డి తల్లి, సర్పంచు షంషీర్ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రె డ్డిలు అన్నిపల్లి, కాగతి గ్రామాల్లోని ఆయా బాధిత కుటుంబాలను కలసుకొని సంతాపాన్ని తెలపడమే కాకుండా తామున్నామన్న భరోసా కల్పించారు. మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, హెచ్‌డిఎస్ మాజీ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, హరీష్‌రాయల్, పవన్‌రాయల్, రామ్‌కీ, నాగభూషణరెడ్డి, ఎంపిటీసీ తొండా శ్రీరాములు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆమోదయోగ్యమైన పనులు గుర్తించాలి : పిడి రవికుమార్

**చౌడేపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త** సమాజానికీ, వ్యక్తిగత ఆర్థిక అభివృద్ధికి ఆమోదయోగ్యమైన పనులను గుర్తించాలని డ్వామా పడి రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణంలో 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. వలసల నిర్మూలన కోసం ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఏ వివిధ శాఖల అనుసంధానం ద్వారా 1707పనులకు గానూ సుమారు రూ. 7.08కోట్ల నిధులను వేతనాలు, మెటీరియల్ రూపంలో చెల్లించామన్నారు. సామాజిక తనిఖీ బృందంచే 15రోజులపాటు పనుల రికార్డుల ఆధారంగా తనిఖీ చేసి గుర్తించిన అంశాలను సభలో వివరించారు. ఉపాధిహామీ పనుల్లో పండ్లతోటల పెంపకం, భూగర్భ జలాలను పెంచే పనులను గుర్తించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించడమే కాకుండా సరైన రికార్డులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో చేపట్టాల్సిన అంశాలను పాటించకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సామాజిక తనిఖీల్లో రూ. 28వేల రికవరీకి ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించిన సిబ్బందికి జరిమానాలు విధించారు. డివిఓ ఉమావాణి, ఎపిడీ రవికుమార్, ఎపిఓ శ్రీనివాస్‌యాదవ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## కొళాయి కనెక్షన్లకు రోడ్డు తవ్వేశారు.. పూడ్చడం మరిచారు

### - వర్షపునీటితో చెరువును తలపిస్తున్న వైనం !!



**కుప్పంరూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త** ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రోడ్డులో తవ్విన గు ంతలను అలాగే వదిలేయడంతో ప్రజలు తరచూ గుంతల్లో పడి గాయపడడం కొద్దిపాటి వర్షానికే రోడ్డులో ఉన్న గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్న దృశ్యం మండలంలోని గోనుగూరు గ్రామంలో చోటుచేసుకుంది. నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ కేంద్రమైన గోనుగూరు గ్రామంలో జల్ జీవన్ మిషన్ (జెజెఎం)పథకంలో భాగంగా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు గ్రామీణనీటిపారుదల శాఖ అధికారుల అధ్వర్యంలో పనులు జరిగాయి. కొళాయి కనెక్షన్లకోసం గ్రామంలో ఉన్న రోడ్డును జెసిబి యంత్రంతో తవ్వి కనెక్షన్లు ఇచ్చారు. అయితే పని అయిపోయాక గుంతలను పూడ్చడం మాత్రం అధికారులు మరచిపోయారు. దీంతో తరచూ వాహనదారులు అక్కడ బోల్తాపడి గాయాలపాలవుతున్నట్లు సర్పంచ్ డా॥ దీప్తి భాగ్యరాజ్ వాపోయారు. శనివారం కురిసిన తేలికపాటి వర్షానికి గుంతల్లో నీరు చేరి చెరువును తలపించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో గుంతలు తవ్విన రోడ్డును బాగు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సౌభాగ్య లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన శ్రీ చౌడేశ్వరిదేవీ



**పుంగనూరు,అక్టోబరు 5 ప్రభాతవార్త** మండల పరిధిలోని చదళ్ల గ్రామంలో ఉన్న సప్తమాతృక సమేత శ్రీచౌడేశ్వరీ దేవి,ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారికి సౌభాగ్య లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ,సోమ కుంభారాధన, వేదిక అర్చన, ఇత్యాగ్ని సమర్పణ, గణపతి హోమం, మూలమంత్ర హోమాలు, శ్రీసూక్త హోమం, దుర్గాసూక్త హోమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్వీఆర్ ట్రస్టు అద్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి దంపతులు పూజలో పాల్గొన్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

## శవ రాజకీయాలతో పుంగనూరులోకి ఎంట్రీ

పుంగనూరు,అక్టోబరు 5 ప్రభాతవార్త

గత ఎన్నికలలో ప్రజలలో దారుణంగా తిరస్కారానికి గురైన వైకాపా నాయకులు శవరాజకీయాలు చేయడానికి మళ్లీ పుంగనూరులోకి ఎంట్రీ ఇస్తున్నారని జిల్లా తెలుగుదేశం నాయకులు సయ్యద్‌సుహేల్ అన్నారు. శనివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ,వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వంలో వందల మందిని దారుణంగా చంపేశారని, మిస్బా హత్య కేసు నేటికి ఆకుటుంబానికి న్యాయం జరగలేద న్నారు. మిస్బా కుటుంబీకులు నేటికి పుంగనూరులో రక్షణ పొందుతున్నారని చెప్పారు. పుంగనూరు ప్రజ లనురాజకీయాలకువాడుకునిప్రజలతిరస్కారానికిగురై ఇప్పుడు శవ రాజకీయాలు చేసుకుం టున్నారన్నారు.

## మీ లక్ష్యాలను ఉన్నతంగా ఎంచుకోండి

### - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



**చిత్తూరురూరల్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను ఉన్నతంగా ఎంచుకొని ఆ దిశగా ధైర్యంగా అడుగులు వేయాలని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ తెలిపారు. శని వారం ఆర్‌కె డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్‌డే ఏర్పాటు చేసారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి పౌరులుగా సమా జానికి ఉపయోగపడేలా ఎదగాలనీ, సాంఘిక మాధ్యమాలతో కాలాన్నీ వృధా చేయకుండా తల్లిదండ్రుల కలలను సాకారం చేసే కష్టపడి చదవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ బద్రీనారాయణ. కళాశాల ప్రిన్సిపాల్ ఎం, రమేష్‌బాబులు మాట్లాడుతూ విద్యార్థులందరూ అన్ని రంగాల్లో రాణించేలా కష్టపడాలనీ, తమ అంతర్గత శత్రువైన ద్వేషం, అహం, చదువుపట్ల నిర్లక్ష్యం తదితర వాటిని జయిస్తేనే విజయం సాధించగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం యూనివర్శిటీ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అతిధుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటచలపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కమీషనరు దృష్టికి రెగ్యులర్ డ్రైవర్ల సమస్యలు



**చిత్తూరురూరల్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో చాలా కాలంగా రెగ్యులర్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనరు దృష్టికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం తీసుకెళ్లారు. శనివారం కమిషనరును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి జ్ఞాపికను అందించి దుశ్శాలువతో సత్కరించారు. చాలా కాలంగా స్పెషల్ పే డ్రైవర్లకు ఇవ్వడం లేదనీ, అర్హత వున్న డ్రైవర్లను లైట్ మోటార్ వెహికల్ నుంచి హెవీ వెహికల్ డ్రైవర్లగా గుర్తించి పే స్కేల్ అందించాలన్నారు. ముఖ్యంగా నగరి, పుంగనూరు మున్సిపాలిటీ, తిరుపతి కార్పొరేషన్‌లో ఆప్కాస్ ద్వారా డ్రైవర్లుగా గుర్తించి వారికి వేతనంగా రూ.24,500గా ఇస్తున్నారని, అదే వేతనంను చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో డ్రైవర్లకు అందించాలని కోరారు. అలాగే 15,20 సంవత్సరాలుగా అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు డ్రైవర్లు వర్కర్లుగా జీతం తీసుకొంటు డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేసారు. సానుకూలంగా స్పందించిన కమీషనరు త్వరలో సమస్యలను పరిష్కరించి తగు న్యాయం చేస్తానని హామి ఇచ్చారు, కమీషనరును కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు పన్నీర్‌సెల్వం, జనరల్‌సెక్రటరీ రోహన్‌భాష, గౌరవఅధ్యక్షుడు షణ్ముగం, ముఖ్యసలహాదారుడు రామన్న, మురళీమోహన్, అరుణ్, బాబు, వెంకటేశులు తదితరులు వున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వెంకటేశ్వరునికి యోగ వెంకటేశ్వరస్వామి అలంకారం

సూళ్లూరుపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీ మద్వేంకట రామమూర్తి దేవస్థానంలో వెలసి ఉన్న వెంకటేశ్వర స్వామికి పెరటాశి నెల మూడవ శనివారంలో భాగంగా వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ యోగ శ్రీనివాసమూర్తి అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి దేవస్థానం వద్ద బారులు తీరారు. ప్రధాన అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు నేతృత్వంలో అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త బీరక రాంబాబు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో వరల్డ్ స్పేస్ వీక్ ర్యాలీ

సూళ్లూరుపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త




భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శనివారం సూళ్లూరుపేటలో స్పేస్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల ఆవరణ నుంచి డిఓఎస్ కాలనీ వరకు సాగిన స్పేస్ వాక్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, ఇస్రో ఉద్యోగులు పెద్దసంఖ్యలో స్పేస్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ ఈ ఏడాది వరల్డ్ స్పేస్ వీక్ సందర్భంగా స్పేస్ అండ్ క్లైమాట్ ఛేంజ్ అనే నినాదం పెట్టి ప్రజల్లో అవగాహన కోసం స్పేస్ వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాతావరణంలో వస్తున్న మార్పుల గురించి పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఅన్నపూర్ణదేవి అలంకారంలో చాముండేశ్వరిదేవి

కోట, అక్టోబర్ 5 ప్రభాతవార్త



కోట మండలం గూడలిలోని శ్రీరామలింగ చాముండేశ్వరిదేవి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం చాముండేశ్వరిదేవి శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సకల సృష్టికి ప్రాణాధారమైన అన్నం ఈ తల్లి దయ వల్లనే లభిస్తుంది. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపమని పెద్దలు చెబుతారు. ఈ రూపంలో ఆది పరాశక్తిని అర్థిస్తే బుద్ధి వికాసం, సమయస్ఫూర్తి, బుద్ధి కుశలత, వాక్‌శుద్ధి కలుగుతాయి. మానవుడిని సంపూర్ణుడిగా ఈ శక్తి అనుగ్రహిస్తుంది. అమ్మ ధరించిన అక్షయపాత్ర సకల శుభాలను అందిస్తుంది. బిడ్డల ఆకలిని తీర్చడానికి ఆది పరాశక్తి స్వయంగా అన్నపూర్ణదేవిగా రావడం ఈ అవతారం విశేషం. పరిపూర్ణమైన చిత్తంతో ఆరాధించిన వారి సమస్త పోషణ భారాన్ని ఈమె స్వయంగా వహిస్తుంది. భక్తులకు అన్ని ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త ఆశిం శ్రీనివాసులు దగ్గరుండి పర్యవేక్షించారు.

## ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### జూనియర్ సివిల్ జడ్జి అనూష

వెంకటగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష తెలిపారు. సిడిపిఓ కార్యాలయంలో మహిళ న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సును నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. అందురూ చట్టాలను ఉపయోగించు కోవాలని సూచించారు. బాల్య వివాహాలు జరిపిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐ ఏవి రమణ, ఎస్ఐ సుబ్బారావు, సిడిపిఓ శంషాబాద్ బేగం, న్యాయవాది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలి

### ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి

గూడూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త




దివ్యాంగులు మనోధైర్యాన్ని పెంపొందించు కుని వారి సంపాదనపై వారు నిలబడే విధంగా తోడ్పాటు అందించే దిశగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అందుకు తాను అన్ని విధాల సహకరిస్తానని ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో ఎంపిక చేసిన దివ్యాంగులకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల 5న పట్టణ పరిధిలోని ఎంపిక చేసిన పలువురు దివ్యాంగులకు రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పట్టణంలోని కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు రెడ్ సంస్థకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. అయితే దివ్యాంగులు మానసిక ధైర్యం పెంపొందించుకొని చిన్న చిన్న పనుల ద్వారా సంపాదన ప్రారంభించాలని సూచించారు. అందుకు అవసరమైన పూర్తి సహకారాన్ని తాను అందిస్తానని వెల్లడించారు. ఆ దిశగా స్వచ్ఛంద సంస్థలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనుజ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాల గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

బాలాయపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త



మండలంలోని కాలగంగమ్మ దేవస్థా నంలో విగ్రహ ప్రతిష్ట మహాకుంభా భిషేకం వైభవంగా జరిగింది. విగ్ర హాలకు దేవస్థానం వేద పండితులు శాస్త్రోక్తంగా పూజ లు నిర్వహించి విగ్రహా లను ప్రతిష్టించారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో ఈ దేవాలయం నిర్మాణం అయింది. పూజా కార్యక్రమాల్లో ఎంపిటిసి శంకర య్య, అమలేశ్వరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నూతన ఆలయాన్ని పరిమళ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరిం చారు. ముందుగా గోమాతకు పూజలు నిర్వహించారు. శాంతి కళ్యాణంలో ఉభయదాతలుగా ఎంపిటిసి శంకరయ్య, అమలేశ్వరి దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన నిర్వహించా రు.చుట్టుపక్కలగ్రామల నుంచిఅధికసంఖ్యలోభక్తులువిచ్చేసిస్వామి,అమ్మవార్లనుదర్శించుకున్నారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

దొరవారిసత్రం, అక్టోబరు 5 ప్రభాతవార్త ;

మండలంలోని మీజూరు సమీపంలో జరిగిన రోడ్డుప్రమాధంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది.సేకరించిన సమాచారం మెరకు వవరాలిలా ఉన్నాయి.మీజూరుకు చెందిన రవిబాబు,విజయ్‌కుమార్‌లు మోటార్‌సైకిల్‌పై సూళ్ళూరుపేటకు వెళ్ళి పనులు పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామమైన మీజూరుకు వస్తుండగా మార్గమధ్యలో తొగరాముడి రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పింబోయి ప్రమాధవశాత్తు మోటార్‌సైకిల్ బోల్తాపడింది.దీంతో మోటార్‌పైకిల్‌పై ప్రయాణిస్తున్న రవిబాబు,విజయ్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహయంతో చికిత్సనిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## నేలపట్టును సందర్శించిన డిఎఫ్ఓ

దొరవారిసత్రం, అక్టోబరు 5 ప్రభాతవార్త ;

మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని సూళ్ళూరుపేట డిఎఫ్ఓ హారిక శనివారం సందర్శించారు.అనంతరం పక్షల రక్షిత కేంద్రంలోని చెరువు కట్టపైకి వెళ్ళి కడపచెట్లుపై విడిదిచేసివున్న విదేశీవలస విహంగాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్షుల కేంద్రానికి వచ్చే సందర్శకులకు తాగునీరు, మరుగుదొడ్లు కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. పక్షుల కేంద్రంలో సందర్శకులకు చేపట్టవలసిన చర్యలపై అధికారులకు పలుసూచనలు, సలహాలు తెలియజేశారు. ఆమె వెంట రేంజర్ సౌజన్య, నరసింహారావు, ఎఫ్ఎస్ఓ బాలయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జాబ్ మేళా ద్వారా 61 మందికి ఉద్యోగాలు

**చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్, సీడాప్, డిఆర్‌డిఎలు సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో 61 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం లభించింది. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్, ఇన్నోవ్‌సోర్స్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, క్రియ నెక్స్ వెల్త్ ప్రైవేటు లిమిటెడ్, అపోలో ఫార్మసిస్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగులను ఎంపిక చేశారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి మొత్తం 131 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో కంపెనీల ప్రతినిధులు 61 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి గోపి, ఐటిఐ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మురళీకృష్ణ, రీజినల్ ప్లేస్‌మెంట్ అధికారి యుగంధర్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వీధి దీపాలకు మరమ్మతులు



**పాలసముద్రం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో మరమ్మత్తులకు గురైన వీధి దీపాలను పంచాయతీ సర్పంచ్ నరసింహరాజు, కార్యదర్శి సత్యనారాయణలు పలుచోట్ల రిపేర్లు చేసి సరి చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో పలు చోట్ల వీది దీపాలు వెలుగకపోవడంతో ప్రజల నుండి గత కొన్ని రోజులుగా ఫిర్యాదులు వున్నాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన సర్పంచ్ నరసింహరాజు, కార్యదర్శి సత్యనారాయణలు శనివారం సుమారు 27 వీధిలైట్లను సరి చేశారు. కొన్ని రోజులుగా వెలగకుండా వున్న వీధి దీపాలను సర్పంచ్,కార్యదర్శులుస్పందించి బాగు చేయడంతో ప్రజలు వారిని అభినందించారు.

## ఇక మట్టి అక్రమ రవాణా

### - పాలసముద్రం మండలంలో ప్రారంభమైన మట్టి దందా



**పాలసముద్రం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** పాలసముద్రం మండ లంలో మట్టి అక్రమ రవాణా దందా ఊపందుకుంది. కొంత మంది అధికారుల నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మట్టిని ట్రాక్టర్ల ద్వారా తమిళనాడు రాష్ట్రంకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి రెవెన్యూ అధికారుల అండ వుందనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని మట్టిని తమ కళ్ళ ఎదుటే ట్రాక్టర్‌కు లోడ్ చేసుకుని తీసుకెళ్తుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ అనుమానాలకు బలం చేకూరుతున్నాయి. మట్టి అక్రమ రవాణాను ఎవ్వరు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ వ్యాపారం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. ఇది వరకు పాలసముద్రం నుండి ఇసుక జోరుగా తమిళనాడు రాష్ట్రంకు అక్రమ రవాణా జరుగుతుండటంతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చర్యలు తీసుకోవడంతో అక్రమార్కులు మట్టి అక్రమ రవాణాపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. మట్టి అక్రమ రవాణాను ఇలాగే వదిలేస్తే మండల పరిధిలో మట్టి అక్రమ రవాణా అధికమై ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అసవరం ఎందైనా వుందని మండ ప్రజలు విన్నవించుకుంటున్నారు.

## గణపతి దుర్గ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** చిత్తూరు సంతపేటలోని జిజెఎం ఫంక్షన్ హాలులో జరుగుతున్న దసరా దేవి శరన్నవరాత్రుల్లో భాగం గా శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గణ పతి దుర్గ హోమం, మన్యు శుద్ధ పూజాది కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా లోక కళ్యాణంను కోరుతూ శ్రీశ్రీశ్రీ బాలకృష్ణ గురూజీ, వారి శిష్య బృందం 9 రోజుల పాటు నవచండీ యాగం నిర్వహిస్తున్నారు. ఈ నవ చండీ యాగంలో భాగంగా మూడవ రోజు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గణపతి దుర్గహోమం, మన్యు శుద్ధ పూజాది కార్యక్రమాల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే చండీ హోమంతో నియోజకవర్గ ప్రజలందరు సుఖ సంతోషాలతో వుండాలని ఎమ్మెల్యే గురజాల ఆకాంక్షించారు. ఈ పూజా చిత్తూరు నగర ప్రజలు, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోవిందరాజస్వామి గుట్టపై ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు

**చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి, పరిసర గ్రామాల భక్తుల కోరిక మేరకు గోవిందరాజస్వామి గుట్టపై వెలసిన శ్రీవారి పాదం ఆలయ నిర్మాణం, నిర్వహణకు ప్రతి ఏడాది ప్రభుత్వం తరపున 5 లక్షల రూపాయలు అందజేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దిగువమాసాపల్లి, పరిసర గ్రామాల ప్రజలు, ఉమ్మడి పార్టీల నాయకులతో కలిసి శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గోవిందరాజస్వామి గుట్టపై వెలసిన శ్రీవారి పాదం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండపై ఆలయ నిర్మాణం, అభివృద్ధి కోసం జివిటిటి పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది ప్రభుత్వం తరపున 5 లక్షల రూపాయలు అందజేస్తామని ప్రకటించారు. ఈ పూజా కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం మాజీ ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు



రేణిగుంట, అక్టోబరు 5 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఘనంగా వీడ్కోలు లభించింది. తిరుమల ఎవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించి తిరుగు ప్రయాణమైన ఆయనకు విమానాశ్రయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాచ్ పాయ్, జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, పూతల పట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, వరప్రసాద్, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు వీడ్కోలు పలికారు. విమానాశ్రయం వెలుపల ముఖ్యమంత్రి అభిమానులను, టీడీపీ నాయకులు, కార్యకర్తలను ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. అర్జీలను తీసుకుని తక్షణం పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

## మానవత్వానికి మరోపేరు ముఖ్యమంత్రి

### ఒకరికి 5 లక్షలు, మరొకరికి 50 వేలు సాయం చేసిన చంద్రబాబు న చేతులు జోడించి మొక్కిన బాధితులు



రేణిగుంట, అక్టోబరు 5 ప్రభాతవార్త: మానవత్వానికి మరో పేరుగా ఇంకోసారి చాటుకున్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి శనివారం తిరుగు ప్రయాణమై ఆయనను విమానాశ్రయంలో కొంత మంది బాధితులు కలిశారు. తక్షణం స్పందించిన ఆయన బాధితులకు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రేణిగుంటకు చెందిన పసుపులేటి ప్రసాద్‌బాబు, రోజారాణి దంపతులు కుమారుడు పసుపులేటి సురేష్‌బాబు(సూరి) పుట్టినప్పటి నుంచి ప్రత్యేక ప్రతిభావంతుడు, కొంత కాలంగా అతను క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చంద్రబాబుకు వీర అభిమాని, చంద్రబాబుతో కలసి ఫోటో తీసుకోవాలని అతని ఆశ. అతని ఆశను స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన సుధీర్‌రెడ్డి చంద్రబాబుతో కలసి ఏర్పాట్లను చేశారు. సూరిబాబు దీన స్థితిని చూసి చలించి పోయిన ముఖ్యమంత్రి అతనితో ఫోటో దిగి సూరి కోరిక తీర్చడమే కాక 5 లక్షల రూపాయలు చెక్కును ప్రభుత్వం తరపున అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మరో మహిళ సుబ్బరత్నమ్మ గత సంవత్సరం యాక్సిడెంట్‌లో తన భర్త ప్రసాద్ మృతి చెందినట్లు ఎమ్మెల్యే ద్వారా తెలుసుకున్నారు. వెంటనే ప్రభుత్వం తరపున 50 వేలు ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కలెక్టర్‌ని ఆదేశించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ బాధితురాలుకి 50 వేలు చెక్కును అందజేశారు.

## మిస్ ఆంధ్ర యూనివర్స్ చందన ఉన్నతస్థాయికి ఎదగాలి

### - ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

### - కుప్పం ప్రజల తరపున ఘనంగా సత్కారం !!



కుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త మిస్ ఆంధ్ర యూనివర్స్‌గా ఎంపికైన చందన కుమారి చందన జయరాం మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో మిస్ ఆంధ్ర యూనివర్స్ చందనను కుప్పం ప్రజల తరపున ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పానికి సిఎం చంద్రబాబునాయుడు ఎలా పేరు సాధించారో చందన కూడా భవిష్యత్తులో అలాంటి పేరు సాధించాలని అందుకు తెదేపా తరపున అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కుప్పం లాంటి గ్రామీణ ప్రాంతంనుంచి మిస్ ఆంధ్రగా ఎంపికై మిస్ ఇండియా యూనివర్స్ పోటీల్లో పాల్గొన్న ఘనత చందనకు దక్కడం హర్షణీయమన్నారు. తమ కుమార్తె ఇష్టపడిన రంగంలో రాణించేలా ప్రోత్సహిస్తున్న తెదేపా సీనియర్ నేత ఎంకెపురం ఉయ్యాల జయరాంరెడ్డి దంపతులను అభినందించారు. ఈసందర్భంగా చందన జయరాం మాట్లాడుతూ తాను ఫ్యాషన్ ప్రపంచ ంలోకి ఓ గుర్తింపు పొందాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిస్ ఆంధ్ర యూనివర్స్ చందన జయరాం తల్లిదండ్రులు ఉయ్యాల జయరాంరెడ్డి దంపతులు, తెలుగు మహిళ నేతలు అనసూయ, సుగుణమ్మ, భాగ్యలక్ష్మి త్రిలోక్, పద్మమ్మ, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, ఐటిడిపి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గజలక్ష్మి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:



గజలక్ష్మి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు శనివారం అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా ఆలయ పడికావలికి తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో గజలక్ష్మీదేవిగా విశేష అలంకరణ గావించి గజ వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ ఓంశక్తి మాలధారణ గావించిన భక్తుల భజనలతో అమ్మవారి వాహనసేవ కన్నుల పండువగా సాగింది. ఈ గజవాహన సేవకు మిట్టపాళ్యంకు చెందిన దివంగత బి.చంద్రమౌళిరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు బి.శ్రీనివాసులు రెడ్డి, బి.రవికుమార్ రెడ్డి, తిరుపతి, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు చెందిన బి.శ్రీనివాసులు రెడ్డి, మల్లయ్యపల్లి గ్రామస్థులు దాతలుగా వ్యవహరించారు.

## మలయప్పస్వామి స్నపనంలో విల్లిపుత్తూరు చిలకల మాలలు,కిరీటాలు



తిరుమల,అక్టోబర్5 ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు శనివారం మధ్యాహ్నం ప్రత్యేక స్నపన తిరుమంజనం జరిగింది. కల్యాణోత్సవమండపంలోని స్నపన మండపాన్ని పలురకాల విదేశీ పండ్లు, సువాసనల పుష్పాలతో తీర్చిదిదారు. ఉపనిషత్తుమంత్రాలు, దశశాంతిమంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రములు దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసి వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణం చేశారు. ఈ వేడుకలో ఏలకులు, వట్టివేర్లు, బాదం, వివిధ రకాల డ్రైఫ్రూట్స్, చందనం, నల్లద్రాక్ష, రోజ్‌పెటల్స్, తులసిదండలు స్వామిఅమ్మవార్లకు అలంక రించారు. ఒకటన్ను సంప్రదాయ పుష్పాలతో,కట్‌ఫ్లవర్స్ వినియోగిం చారు. సుగంధద్రవ్యాలు, ఎండుఫలాలు, విల్లిపుత్తూరు నుండి చిల కలతో చేసిన మాలలు, కిరీటాలు ఉత్సవమూర్తులు మలయప్ప స్వామి, శ్రీదేవిభూదేవులను స్పృశించి తరించాయి. శనివారం మధ్యాహ్నం 2గంటల నుండి 4గంటలవరకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి విశేష స్నపనతిరుమంజనం జరిగింది. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు వేణు గోపాలదీక్షితులు, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, డిప్యూటీ ఈఓ లోకనాథం, అర్చకులు పాల్గొన్నారు. చెన్నైకిచెందిన దాతలు వీటిని సమకూర్చారు.

## సమన్వయంతో భక్తులకు సేవలు

### -టిటిడి ఈఓ శ్యామలరావు



తిరుమల,అక్టోబర్ 5ప్రభాతవార్తప్రతినిధి: బ్రహ్మోత్సవాల్లో తిరుమలకు వచ్చిన భక్తులకు అధికారులు సమన్వయంతో అవసరమైన సేవలందించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి చెక్‌లిస్ట్ ఉండాలని, యాత్రికుల నుండి సరైన అభిప్రాయాలు సేకరించి తదనుగుణంగా సేవలు మెరుగుపర చాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం అధికారులతో ఆయన సమీక్షించారు.

## మరింత నాణ్యతతో అన్నప్రసాదాలు



తిరుమల,అక్టోబర్ 5ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు వస్తున్న భక్తుల అవసరాలకు పాంచజన్యం, వకుళమాత విశ్రాంతి భవనాల్లోని వంటశాలలను శనివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పారంభించారు.

## బ్రహ్మోత్సవాల్లో నేడు

(06.10.2024 )



"సింహవాహనం" (ఉదయం 8గంటలకు) వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు ఆదివారం ఉదయం శ్రీమలయప్పస్వామి సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. స్వామివారి దశావతారాల్లో నాల్గవది నరసింహఅవతారం. యోగశాస్త్రంలో సింహం బలానికి వేగానికి ఆదర్శంగా భక్తులు భావిస్తారు.

-"ముత్యపుపందిరివాహనం" (రాత్రి7గంటలు)



బ్రహ్మోత్సవాల్లో మూడవరోజురాత్రి మూడునామాల స్వామిముత్యపు పందిరి వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తాడు. చంద్రునికి ప్రతీకగా ముత్యాలు తెలియజేస్తుంది. ఆదిశేషుని పడగలు ముత్యాల గొడుగుగా ధరించిన స్వామి వారిని దర్శిస్తే సకలశుభాలు కలుగుతాయి.

## బ్రహ్మోత్సవాల్లో సిబ్బంది సేవలు ప్రశంసనీయం

### -పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



కాణిపాకం, అక్టోబర్ 5 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో గత నెల 7 నుండి 27 వరకు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆలయ అధికారులు, సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగించుకున్న సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆలయ ఉభయదారులు, స్థానికులు, గ్రామస్థులు, భక్తుల సహకారంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 21 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్సవాల్లో చిన్న ఉద్యోగి నుండి అధికారుల వరకు ఎంతో నిబద్ధతతో పనిచేశారని ఈసందర్భంగా ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు విజయవంతంకు ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, వేదపండితులు, మీడియా ప్రతినిధులు అందించిన సేవలు, కృషి ప్రసంశనీయమన్నారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బందికి బ్రహ్మోత్సవ బహుమతులను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఈఈ వెంకటనారాయణ,సీఎఫ్ఓ నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓలు రవీంద్రబాబు,ఎస్వీ.కృష్ణారెడ్డి, ధనుంజయ,సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు,మల్లిఖార్జున ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, అధికారులు,అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోయంబత్తూరుకు విమాన సర్వీసులు ప్రారంభించండి

రేణిగుంట, అక్టోబరు 5 ప్రభాతవార్త: రేణిగుంట(తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కోయంబత్తూరు నుంచి కోయంబత్తూరుకు విమాన సర్వీసులు ప్రారంభించాలని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని లేఖ ద్వారా కోరారు. రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజా కంపెనీలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వగృహానికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శనివారం వచ్చారు. ఇటీవల గల్లా అరుణకుమారి రాసినగల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని గల్లా జయదేవ్ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు, స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి అందజేశారు. వారి ఇరువురు వేరు వేరుగా పుస్తకానికి గౌరవమూల్యం వెయ్యి రూపాయలు ఇచ్చారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు ఎంతో మంది వ్యాపారస్తులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. శ్రీవారి దర్శనార్థం దక్షిణ రాష్ట్రాల నుంచి చాలా మంది భక్తులు వస్తున్నారని తెలిపారు. వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంటుందని ఒక విమాన సర్వీసును కోయంబత్తూరుకు నడపాలని కోరారు. కేంద్ర మంత్రి ఇందుకు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అమరరాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్, తెలుగుదేశం పార్టీ నేతలు కోడూరు బాలసుబ్రహ్మణ్యం, బడి సుధాయాదవ్, కంపెనీ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్‌నరసింహనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అప్సియా విషయంలో పోలీసులు నిర్లక్ష్యం:మాజీ మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు, అక్టోబరు 5 ప్రభాతవార్త



ఇటీవల కిడ్నాప్‌కు గురై హత్యగురైన చిన్నారి అప్సియా విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం ఆయన ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి అప్సియా కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి అవాంచనీయసంఘటనలు రాష్ట్రంలో జరగలేదన్నారు. చిన్నారి కుటుంబానికి కూడా వైకాపా అండగా ఉంటుందన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం చిన్నారి అప్సియా మృతివెనుక వున్న మిస్టరీ చేదించేందుకు దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. వారి వెంట మాజీ ఎంపీ రెడ్డెప్ప, మునిసిపల్ చైర్మెన్ అలీంభాషా, ఎంపీపీ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీచెంగాళమ్మ శరన్నవరాత్రులు



సూళ్లూరుపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి దేవస్థానంలో మూడోరోజు శరన్నవరాత్రులు దేవ స్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన చండీయాగాన్ని దేవస్థానం ప్రాంగణంలోని యాగమండపంలో గోమాతకు పూజలు చేసిన అనంతరం పూర్ణాహుతితో యాగాన్ని ముగించారు. ఉభయకర్తలుగా హైదరాబాద్‌కు చెందిన గండవరపు లక్ష్మీవరప్రసాద్‌రెడ్డి, కృష్ణజ్యోతి దంపతులు వ్యవహరించారు. అలాగే అమ్మవారికి శరన్నవరాత్రుల సందర్భంగా మూడోరోజు మన్నారుపోలూరు, నూకలపాలెం, వట్రపాలెం గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మణ్ణికి సారెలు సమర్పించారు. అమ్మణ్ణి అన్నపూర్ణ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చింది. అలంకారానికి ఉభయకర్తలుగా కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు వ్యవహరించారు.

## అన్నపూర్ణాదేవి అలంకరణలో సదుమమ్మ



సదుం, అక్టోబరు 5 ప్రభాతవార్త సదుం గ్రామ దేవత సదుమమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం సదుమమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకఅభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తుల చేత కుంకుమాభిషేకం నిర్వహించారు. సదుం బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. ఉపాధ్యాయులు నాగరాజ,సుబ్రమణ్యం, రుక్మిణి,బలిజ ప్రముఖులు,గ్రామంలోని బలిజలందరు ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా బూరగమంద, కొత్తపల్లె శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయాలో శనివారం తిరువళ్ల శనివారం మూడో వారం కావడంతో భక్తులతో కిటకిటలాడాయి. అదేవిధంగా జాండ్రపేటలోని శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారికి సరస్వతీ దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. గౌతమ్, శ్రీదేవిలు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

## దేవాదాయశాఖ మంత్రికి కాణిపాకం ప్రసాదాలు అందజేత



కాణిపాకం, అక్టోబర్ 5 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని శనివారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్‌లు మర్యాద పూర్వకంగా కలసి స్వామివారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. సీఎం తిరుమల పర్యటన సందర్భంగా ఆయనతో పాటు వచ్చిన మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డిని రేణిగుంట ఏయిర్‌పోర్టులో కలసి కాణిపాకం స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటాన్ని, ప్రసాదాలను, అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాజరాజేశ్వరి దేవిగా మరగదాంబిగా అమ్మవారు



కాణిపాకం,అక్టోబర్ 5 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం మరగదాంబిగా అమ్మవారు శ్రీరాజ రాజేశ్వరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు శ్రీమణికంఠేశ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ రవీంద్రబాబు,సూపరెండెంట్‌లు కోదండపాణి,శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు సురేష్, విగ్నేష్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## పలుకుబడి దర్శనాల తిప్పలు: మంత్రి సూచనలతో ఇఓ సీరియస్

### అర్చకుడు: ఇద్దరు పిఆర్ఓలపై సీరియస్ ఇక వేద పండితులు పారాయణకే పరిమితం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలుకుబడి దర్శనాల తప్పలు వర్ణనాతీతంగా మారింది.తెలంగాణకు చెందిన మంత్రి తాలూకు భక్తుల ఫిర్యాదుతో రాష్ట్ర మంత్రి సీరియస్ అయ్యారు.ఈ నేపధ్యంలో ఆలయ ఇఓకు సమాచారం అందించారు. సమగ్ర విచారణ, సిసి కెమెరాలను పరిశీలించిన ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ శనివారం సమావేశం నిర్వహించారు. ఎవరి మీద అయితే ఫిర్యాదులు అందాయో వారితో సమావేశమయ్యారు.ఇక మీదట ఆలయంలోని వేదపండితులు కేవలం వేద పారాయణం, విఐపిల స్వాగతం, ఆశీర్వచనాలకే పరిమితం చేస్తూ ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.రెండు నెలల క్రితం రాహుకేతుదోష నివారణ పూజల నిర్వహణకు వేదపండితులను నియమించారు.

**తెలంగాణ మంత్రికి ఫిర్యాదులు:**

శ్రీకాళహస్తీశ్వరాయానికి ంరెండు రోజుల క్రితం తెలంగాణాకు చెందిన మంత్రికి సంబంధించిన భక్తులు వచ్చారు. వారిని పిఆర్ఓలు శ్రీనాథ్,రవిలు లోపలకు తీసుకొచ్చారు. వారిని సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద పూజలకు కూర్చొబెట్టారు. ఐదువేల రూపాయల టిక్కెట్లు కొనుగోలు చేసారు. వారిని కూర్చొబెట్టగా ఎస్‌సి వస్తున్నారని ఆ సిబ్బంది హంగామా చేసారు. పూజలకు కూర్చొన్నవారిని పక్కన కూర్చొబెట్టారు. పూజలు జరిపిన వేదపండితుడు పేర్రాజుశర్మ పూజలు చేసి సంభావన డిమాండ్ చేసారు. అలాగే అంతరాలయ దర్శనానికి రూ.500లు డిమాండ్ చేసినట్లు సమాచారం.అయితే తెలంగాణ నుంచి వచ్చిన భక్తులు తెలంగాణ మంత్రికి ఫిర్యాదు చేసారు. ఆమె ఎపి మంత్రికి ఫిర్యాదు చేసారు. మంత్రి ఇఓ చంద్రశేఖర్ ఆజాద్‌కు సమాచారం అందించి విచారణ జరపమని కోరారు.దాంతో ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ సమగ్ర విచారణ జరిపారు. పిఆర్ఓలు శ్రీనాథ్,రవిలతో పాటు వేదపండితుడు పేర్రాజును విచారించారు. సమావేశంలో వారికి వార్నింగ్ ఇచ్చారు. ఇకమీదట వేదపండితులు కేవలం వేదపారాయణ, ఆశీర్వచనా లు, స్వాగతాలకే పరిమితం చేసారు.పిఆర్ఓలపై ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఉత్కంఠత చోటు చేసుకుంది.

## గాయత్రిదేవిగా ముత్యాలమ్మ



బంగారుపాళ్యం, అక్టోబర్ 5 ప్రభాతవార్త: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం బంగారుపాళ్యం గ్రామ దేవత ముత్యాలమ్మ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం ఆలయ అర్చకులు మురళీస్వామి, కార్తీక్ స్వాములు మూల విరాట్ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిగా గాయత్రిదేవిగా అలంకరణ నిర్వహించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా లోకనాధపిళ్ళై, విజయ్‌భాస్కర్, కామరాజు, బాబురావు, కుమార్‌స్వాములు వ్యవహరించారు. అమ్మవారికి జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, ఆలయ కమిటీ ఛైర్మన్ ఎంబి కృష్ణమూర్తి తదితరులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రుద్రప్ప, మురుగేష్, జయచంద్ర రాజు, సుబ్బరాము తదితరులు పాల్గొన్నారు.